# అమెరి'కులాసా' కథలు
## – వంగూరి చిట్టెన్‌రాజు





\- 7 -

# చందాల సభలో దాతల చమత్కారాలు

హమ్మయ్య, అమెరికాలో ఘంటసాల ఆరాధనోత్సవాల పేరిట ప్రతీ ఏడూ మేము నిర్వహించే విరాళాల సేకరణ మహా యజ్ఞం మొత్తానికి పూర్తి అయింది. గత రెండు నెలలగా ఇద్దరు గాయనీ గాయకులు, Y.S. రామకృష్ణ & లలిత దంపతులు, వేగేశ్న వికలాంగుల సేవాశ్రమం వ్యవస్థాపకులు వంశీ రామరాజు గారు 24 నగరాలలో పర్యటించి బీద దివ్యాంగుల సంక్షేమం కోసం విరాళాలు సేకరించారు. ఈ సారి నేను కొన్ని ఊళ్ళకే వెళ్లాను కానీ అన్ని నగరాల ఏర్పాట్లూ చేసే పని గత పదేళ్ళగా నాదే. ఈ క్రమంలో గత దశాబ్దంగా నేను అమెరికాలో వందలాది నగరాలకి వెళ్లినప్పుడు, చందాల సేకరణ మాట ఎలా ఉన్నా వాటిల్లో చోటు చేసుకున్న కొందరు దాతల చమత్కారాలు పంచుకోవాలనిపిస్తోంది క్షమాపణలతో… కేవలం సరదాకి…

ఒకసారి ఒక కార్యక్రమంలో ముందు వరసలో ఒక భార్యా, భర్తా కూచున్నారు. యథాప్రకారం మేము అర డజను పాటలు అయ్యాక వేగేశ్న సంస్థ అందిస్తున్న సేవల గురించి ఒక చిన్న వీడియో వేశాం. ఆ తరవాత నేను ఐదు నిముషాలు ప్రశ్నలకి సమాధానాలు చెప్పి, చందాల అవసరం, ఇతర వివరాలు చెప్పాను. ఇదంతా గమనించిన ఆ దంపతులిద్దరికీ మేము విరాళాలు ఎందుకు అడుగుతున్నామో, ఎంత అడుతున్నామో స్పష్టంగా తెలిసిపోయింది అని నాకు తెలిసిపోయింది. ఎందుకంటే ముందు కుర్చీలలో ఉన్న సదరు భర్త గారు దయాభావంతో చాలా చలించి పోయి చెక్కు తీసి వ్రాయబోయారు….కనీసం వెయ్యి డాలర్లుకి చెక్కు రాస్తున్నట్టు ఆయన మొహం లో ఫీలింగ్ ని బట్టి నాకు అర్థం అయిపోయింది. కానీ పక్కనే ఉన్న పెళ్లాం గారు ఆయన్ని మోచేత్తో డొక్కలో ఒక పోటు పొడిచి ఆ చెక్కు జేబులో పెట్టించేసింది. మళ్ళీ కాస్సేపటికి ఆయనకీ మళ్ళీ ఆవేశం వచ్చి ఇంకో చెక్కు బయటకి తీశాడు. ఈ సారీ అదే తంతు…రెండో డొక్కలో…మొత్తానికి సభ అంతా అయ్యాక ఆయన నా దగ్గరకి వచ్చి "సారీ రాజు గారూ, వచ్చే సారి వెయ్యి డాలర్లు ఇస్తాను. కొన్ని ఫేమిలీ ఇబ్బందులు వచ్చాయి. ఈ సారికి ఇలా కానివ్వండి" అని ఓ వంద డాలర్ల చెక్కు చేతిలో పెట్టాడు…రెండు డొక్కలూ తడుముకుంటూ. ఆయన డొక్క శుద్ధికి కడుంగడు సంతసించి "పరవా లేదు సార్. మీ ఫేమిలీ ప్రాబ్లెమ్స్ నేనూ గమనించాను" అని ఆయన డొక్కలకి కలిగిన డేమేజీ చూసీ చూడనట్టుగా చూపులు మరల్చుకున్నాను. తన రహస్యం నాకు తెలిసిపోయింది అని ఆయనకీ తెలిసిపోగానే ఏమనాలో తెలియక డొక్కలు ఊపుకుంటూ అక్కడ నుంచి పారిపోయాడు….ఎందుకంటే ఆవిడ ఆయన వెనకాలే బాణం ఎక్కుపెట్టి నిలబడి ఉంది కదా! అందుకూ…

ఓహో , అమెరికాలో భార్యా భర్తల పరిస్థితి ఇదా అని నేను కనిపెట్టి, ఆ తరువాత జరిగిన విరాళాల సేకరణ కార్యక్రమంలో "భార్యా, , భర్తలు పక్క పక్కనే కూర్చోకూడదు" అనే నిబంధన పెట్టాను. ఎందుకంటే ఇద్దరూ విడి, విడిగా కూచుంటే ఇలా డొక్కలో పొడుచుట, వ్రాసిన వెయ్యి డాలర్ల చెక్కు జేబులో నొక్కి వేయుట వగైరా సమస్యలు ఉండవు కదా అని నా ఊహ. ఆ రోజు ఒక భార్య ఒక మూలా, ఆవిడ భర్త మరొక మూలా కూచోవలసి వచ్చింది నా నిబంధన వాళ్ళ. ఇక్కడ నా ఊహ దారుణంగా దెబ్బ తినేసింది……ఎందుకంటేమొగుడు ఎలాగా ఇస్తాడు కదా అని ఆవిడా, పెళ్ళాం ఎలాగా దయార్ద్రహృదయం ఉన్నావిడ కదా..ఇవ్వక పోతుందా అని ఆయనా….కార్యక్రమం అంతా విని తప్పట్లు కొట్టి, ఆఖర్న చేతులు ఊపుకుంటూ ఇంటికెళ్ళి పోయారు. మాకు కనీసం డాలర్ విరాళం రాలేదు సరి కదా….వారి విందు భోజనానికి పాతిక డాలర్లు ఖర్చు అయ్యాయి.

ఇక మరొక చోట, మరొక దాత....ఆయన మా విరాళాల బల్ల దగ్గరకి రాగానే కర్ణుడు గారో, బలి చక్రవర్తి గారో మన దగ్గరకి వచ్చి కూర్చొన్న బిల్డ్ అప్ కనపడింది. ఎందుకంటే. ఎందుకంటే ఆయన తన చెక్కు బుక్కు బాహాటంగా చూపిస్తూ వచ్చి, వెనకాల పది మంది నుంచున్నా...సాలోచనగా బుర్ర గోక్కుంటూ ఎదురుగుండా కుర్చీలో తిష్ట వేసి సెటిల్ అయిపోయాడు. ఎన్ని వేల డాలర్లు ఇద్దామా అని మాత్రమే ఆయన బుర్ర గోక్కుంటున్నాడు అని నా బుర్ర కూడా కాస్త గోక్కున్నాను. బలి చక్రవర్తి గారి మొదటి ప్రశ్న.

"నా విరాళానికి పన్ను రాయితీ ఉందా? ఉంటే ఎంత?"

పన్ను రాయితీ ఉంది బాబోయ్ అని అప్పటికి అన్ని కరపత్రాలలోనూ...మా టాక్స్ నెంబర్ తో సహా ప్రకటించి పంచి పెట్టుట, నేను వేదిక మీద నుంచి ప్రగాఢముగా నొక్కి వక్కాణించుటా జరుగుతూనే ఉన్నాయి. అయినా నేను విసుక్కోకుండా

"తప్పకుండా ఉంది సార్. కానీ ఎంత రాయితీ మీకు వస్తుందో మీ ఆదాయ వ్యయాల మీదా, మీరు ఐఆర్ ఎస్ వారికి పంపించే వివరాల మీదా ఆధార పడి ఉంటుంది సార్"

"మీరు ఇండియా నుంచి తీసుకొచ్చిన గాయనీగాయకులకీ డబ్బు ఇస్తారా? వాళ్ళు ఉచితంగా పాడుతున్నారా?

ఈ ప్రశ్న వెనకాల మతలబు నాకు అర్థం అయింది. "ఇస్తాం" అంటే ఒక తంటా, "ఉచితంగా పాడుతున్నారు" అని సగం నిజం,, సగం అబద్ధం ఆడితే మరొక తంటా? సగం నిజం అని ఎందుకు అన్నానూ అంటే పాపం వారు మేము ఏం ఇచ్చినా పుచ్చుకుంటారు. ఉచితంగా పాడిన సందర్భాలు కూడా చాలానే ఉన్నాయి. అంచేత

"అమెరికాలో డాలర్లు ఇవ్వం సార్" అని గోడ మీది పిల్లి వాటం సమాధానం చెప్పాను. అనగా ఇండియా లో రూపాయిల్లో ఇస్తే ఇస్తాం కానీ ఇక్కడ మీ డాలర్లు వారికీ ఇవ్వం సుమా అని భరోసా.

"గుడ్. మరి వాళ్ళ ఖర్చులు, మీ ఖర్చులు ఎవరు భరిస్తారు?"

"దారి ఖర్చులు మేమే భరిస్తాం సార్"

"ఎక్కడ నుంచి భరిస్తారు?"

అప్పటికి ఆయన బుర్రగోకుడు రోగం నాకు అంటుకుంది.

"గుడ్, వాళ్ళ భోజనం, కాఫీ వగైరాలు మా విరాళాల లోంచి మీరు ఖర్చు పెడతారా? నిర్వాహకులు గా మీ భోజనం, దారి ఖర్చులూ వాటి మాట ఏమిటీ?"

ఈ కర్ణుడు గారు ఎక్కడికి వెడుతున్నాడో అప్పుడు నాకు వెలిగింది. ఆయన ఇచ్చిన విరాళం మేము సొంత ఖర్చులకి వాడేసుకుంటే ఆయన వాటాకి రావలసిన పుణ్యం, స్వర్గంలో రంభ పక్కన పక్కా రావేమో అని ఆయన భయం అని నాకు అర్థం అయిపోయింది. అంచేత ఆయనకీ ఆ భయం పోగొట్టి రంభ తో అమెరికులాసా గేరంటీ ఇద్దాం అనే సదుద్దేశ్యంతో

"అబ్బే, అస్సలు ఏ ఖర్చులూ మీ విరాళాల ఖాతాలో వెయ్యడానికి మా క్వీన్ విక్టోరియా గారు చస్తే ఒప్పుకోరు సార్. అవన్నీ ఆవిడే పెట్టుకుంటుంది. ఇందాకా మీరు టాయ్ లెట్ కి వెళ్ళినప్పుడు అక్కడి టిష్యు పేపర్ ఆవిడే స్వయంగా కొని ఇచ్చింది సార్" అన్నాను నా వాదన లో బలం కోసం.

నా కథలు చదవని ఈ కర్ణుడు గారెకి ఈ క్వీన్ విక్టోరియా గారు ఎవరో తెలియక, ఇంగ్లండ్ మహారాణి అంతటి గొప్పావిడే టాయ్ లెట్ పేపర్ కొని ఇచ్చిందీ అన్న నా సమాధానం విని మొహం తెల్లగా పాలిపోయింది. కాస్సేపట్లో తేరుకుని నేను ఎపుడూ ఏ దాతల దగ్గరా వినని రకరకాల ధ్వనుల్లు చెయ్యడం మొదలు పెట్టాడు. అవేమైనా నాకు తెలియని తెలుగు తిట్లా అని అనుమానం వచ్చిన మాట నిజం. మొత్తానికి ఆయన తేరుకుని, మొహం ఒరిజినల్ గోధుమ రంగు కి వచ్చాక

"గుడ్. అయితే మీది పన్ను రాయితీ గల లాభాపేక్ష లేని సంస్థ అని ఐఆర్ఎస్ వారి నుంచి కాగితం కాపీ నాకు ఇవ్వ గలరా? అని మళ్ళీ మొదటికి వచ్చాడు.

"ఇవ్వగలను సార్. కానీ అది మా హ్యూస్టన్ ఆఫీసులో ఉంది. వెళ్ళగానే పంపిస్తాను. ఇంతకీ మిమ్మల్ని సార్వభౌమ పోషకుల్లో వెయ్యమంటారా, చక్రవర్తి పోషకుల్లో రాసుకోమంటారా " అని అడిగాను ఆశగా.

"గుడ్. అసలు కాగితం మీరు వెనక్కి వెళ్ళాక పంప్సిస్తారన మాట. అయితే అది వచ్చాకే నా విరాళం కూడా పంపిస్తాను" అని ఆ గుడ్డు గారు లేచి వెళ్ళిపోయారు. విరాళమూ లేదు. గాడిద గుడ్డూ లేదు.

ఇక అన్నింటికన్నా దాతల పేర్లు వేదిక మీద నుంచి ప్రకటించడం ఎప్పుడూ కట కటే. ఎందుకంటే దాతలు రెండు రకాలు. మొదటి రకం వారు తమ పేరు, ఇచ్చిన విరాళం ఎంత ఘాట్టిగా చదువుతామా, అందరికన్నా ముందు చదువుతామా లేదా అని కళ్ళు మిటకరిస్తూ నన్ను గమనిస్తూ ఉంటారు. సాధారణం గా ఈ కేటగిరీ వారి విరాళాలు వంద లోపే. కానీ వెయ్యి డాలర్లు ఇచ్చిన వారు కొందరు పట్టించుకోరు. రెండో కేటగిరీ వారు "నా పేరు చదివావంటే చంపేస్తాను" బాపతు. ఒక సారి అలా నా పేరు చదువొద్దు అన్న ఒక దాత పేరు నేను పొరపాటున చదవగానే ఆయనకి కోపం వచ్చి, చెక్కు వెనక్కి లాగేసుకుని ఇంటికెళ్ళిపోయాడు. సాధారణంగా మనం ఎంత తక్కువ ఇచ్చామో అందరికీ తెలిసిపోతుంది అని భయపడేవాళ్ళు ఈ కేటగిరీ లో ఎక్కువ మంది ఉంటారు. ఎటునుంచి ఎటుచూసినా దాతల పేర్లు, ఇచ్చిన విరాళం ప్రకటించడం ఎప్పుడూ కత్తి మీద సామే.

అలా అని అమెరికా దాతలు అందరూ అదోలా ఉంటారు అనుకుంటే అని పూర్తిగా తప్పే. అతి కొద్ది మంది మాత్రమే అలా ఓవర్ ఏక్షన్ చేస్తూ ఉంటారు. అమెరికా  తెలుగు దాతల మంచితనానికి ఒక చిన్న ఉదాహరణ...ఒక సారి మేము పాటల కార్యక్రమం మొదలు పెట్టడానికి ముందే ఒకావిడ నా దగ్గరకి వచ్చి, ఒక్క ప్రశ్న కూడా అడగకుండా $500 చెక్కు చేతిలో పెట్టి వెళ్లి మొదటి వరసలో కూచున్నారు. అర గంట తరువాత మేము వేసిన వీడియో చూసి, నా మాటలు విని మళ్ళీ నా దగ్గరకి వచ్చి "నేను ఇందాకా మీకు ఇచ్చిన చెక్కు వెనక్కి ఇచ్చెయ్యండి" అని బలవంతం చేసి వాపసు తీసేసుకున్నారు. నేను ఏమన్నా తప్పు మాట్లాడానా, లేక మా సేవా కార్యక్రమం మీద ఆవిడకి అపనమ్మకం వచ్చిందా అని నేను గిజ గిజలాడిపోయాను. మొత్తం కార్యక్రమం అంతా ఆయిపోయాక నేను విరాళాల దుకాణం కట్టేస్తుంటే ఆవిడ మళ్ళీ నా దగ్గరకి వచ్చి "నన్ను క్షమించండి. ఇందాకా చాలా తప్పు చేశాను." అని మళ్ళీ ఇంకో చెక్కు నా చేతిలో పెట్టేసి వెళ్ళిపోయింది. ఈ చెక్కు ఏకంగా ఐదు వేల డాలర్లకి. ఆవిడ క్షమాపణ చెప్పుకున్నది విషయం తెలుసుకోకుండా ముందు కేవలం ఐదు వందలే ఇచ్చినందుకు. మంచితనానికి సహృదయ స్పందనకీ ఇంత కంటే మంచి ఉదాహరణ ఏం కావాలి.

ఏమాటకామాటే చెప్పుకోవాలీ అంటే..అమెరికాలో ఉన్నంత దాతృత్వ స్వభావంలో కొంచెం అయినా మన పవిత్ర భారత దేశంలో ధన వంతులకి ఉంటే అక్కడి సమాజ సేవకులు ఇన్ని ఇబ్బందులు పడక్కర లేదు. అంతెందుకు. మేము అమరికా నుంచి ఏదైనా ఇండియా సంస్థకి డాలర్లు విరాళం పంపిస్తే అది పుచ్చుకోడానికి  ఘనత వహించిన భారత ప్రభుత్వం వారు అనుమతి ఇవ్వాలిట. అక్కడ లాభాపేక్ష లేని సంస్థ ఆ అనుమతి సంపాదించుకోడానికి ఎక్కడో ఉన్న ఢిల్లీ వెళ్లి అక్కడ ఎవడో గుమాస్తాకి లక్ష రూపాయలు "విరాళం" ఇవ్వాలి అని విన్నాను. అది మన దౌర్భాగ్యం. అమ్మ పెట్టా పెట్టదు. అడుక్కు తినా నివ్వదు అంటే ఇదే అర్థం. ఏమంటారు?

**COMMENTS**